వర్షం.. సహాయక చర్యలు



శేరిలింగంపల్లిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం వాన పడకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగలేదు. నగరంలో భారీ వర్షం కురిసినప్పటికీ శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు కొద్దిమేర జలమయమైనప్పటికీ ఇబ్బందులు కలగలేదు. జీహెచ్ఎంసీ సిబ్బంది తెల్లవారు జామునే లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీటిని తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. చందానగర్ సర్కిల్ పరిధిలోని జనప్రియ వెస్ట్ సిటీ వద్ద రోడ్డుపై చేరిన వరద నీటిని తొలగించారు. పైప్‌లైన్ కోసం తవ్వకాలు చేపట్టి తిరిగి మరమ్మతులు చేయకుండా వదిలేసిన గంగారంలోని మంజీర రోడ్డు కుంగింది. మియాపూర్–బొల్లారం రోడ్డులో జీహెచ్ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. భారీ వర్షం కురిసినా ఆటంకం కల్గకుండా చర్యలు చేపట్టారు. – గచ్చిబౌలి



వర్షానికి గంగారంలో కుంగిన మంజీరా రోడ్డు



జనప్రియ వెస్ట్ సిటీ వద్ద రోడ్డుపై చేరిన వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించిన దృశ్యం

‘ఎకోసెంట్రిక్ పార్కు’ పనులు

ఎన్నాళ్లు ?



నల్లగండ్ల హుడా కాలనీలో ఏర్పాటవుతున్న ఎకో సెంట్రిక్ పార్కు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీలో నాలుగు ఎకరాల్లో ‘ఎకో సెంట్రిక్ పార్కు’ పేరిట రూ.2.60 కోట్ల వ్యయంతో నవంబర్ 5 తేదీ 2022లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే రెండేళ్లయినా అవి పూర్తి కావడం లేదు. ఈ పార్కులో ఇప్పటి వరకు సివిల్‌వర్క్‌లో భాగంగా 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా 20 శాతం పనులకు నిధుల విడుదలలో జాప్యం పార్కుపై ప్రభావం చూపుతోంది. పార్కులో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ ఓపెన్ ఎయిర్

నిధుల విడుదలలో జాప్యం

థియేటర్ పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. పరగోలాస్, టాయిలెట్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. పార్కు ఆర్చి నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. ఎకో సెంట్రిక్ పార్కు నిర్మాణం చేస్తున్న రోజుల్లోనే స్థానికులంతా కలిసి దీనికి ‘విశ్వామిత్ర పార్కు’ గా నామకరణం కూడా చేసుకున్నారు. పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో ఉన్న సహజసిద్ధంగా ఉన్న భారీ బండరాళ్లను తొలగించకుండా అలాగే ఉంచేలా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాతి సంపదను కొనసాగిస్తూనే పార్కును రాక్‌జోన్‌గా ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.



పార్కులో నిర్మిస్తున్న వాకింగ్, సైకిల్‌ట్రాక్



థీమ్ పార్కు ఆర్చి నిర్మించాల్సింది ఇక్కడే..



పార్కులో నిర్మిస్తున్న పరగోల

సర్కిల్ ఏఎంఓహెచ్‌గా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్)గా డాక్టర్ పి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గోషామహల్ సర్కిల్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డికి శేరిలింగంపల్లికి పోస్టింగ్ ఇవ్వగా ఇక్కడ పనిచేసిన నగేష్ నాయక్‌ను ఎల్‌బీనగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

చందానగర్ సర్కిల్ -21 ఏసీపీగా నాగిరెడ్డి

చందానగర్: ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ విభాగాలలో బదిలీలు జరిగాయి. చందానగర్ సర్కిల్ 21 టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా నాగిరెడ్డి, టీపీఎస్‌లుగా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌లు, ఏఎంహెచ్‌ఓగా డాక్టర్ రవిలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏసీపీగా ఉన్న రాజ్‌కుమార్ వేములవాడ దేవాలయం బోర్డుకు వెళ్ళగా, ఫలక్‌నుమా సర్కిల్‌లో టీపీఎస్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, అదే విధంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఏఎంహెచ్‌ఓగా ఉన్న డాక్టర్ రవి చందానగర్ సర్కిల్‌కు వచ్చారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



గంగారంలో.. నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ గౌడ్, జెరిపేటి జైపాల్ తదితరులు

చందానగర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం చందానగర్‌లోని గంగారం గ్రామంలోని రాజీవ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు రాజకీయాల్లో మార్గదర్శకుడుగా నిలిచే నాయకుడన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షాబంధన్



ఆల్విన్‌కాలనీ: రాఖీ పండుగను పురస్కరించుకొని మంగళవారం ఎమ్మెల్యే గాంధీకి మహిళలు ఆయన నివాసంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కా తమ్ముళ్ల, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక ఈ రక్షాబంధన్ అని అన్నారు. కార్యక్రమంలో స్వరూప, భారతమ్మ, కమలమ్మ, ఆశ, శిరీష, స్వరూప, అంజమ్మ, రవళి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.అమీన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. మండల పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపల్ పరిధిలో వివిధ కాలనీలకు చెందిన 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 57 లక్షల రూపాయల చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తహసీల్దార్ రాధ, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రచయిత డా.ముత్యం కన్నుమూత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీకి చెందిన రచయిత డాక్టర్ ముత్యం (65)మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.పాపిరెడ్డి కాలనీ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య అపర్ణ, కూతురు ప్రత్యూష, కుమారుడు వసంత్ ఉన్నారు. డాక్టర్ ముత్యం శాతవాహన యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ ముత్యం రచనలను రెండు రకాలుగా చూడవచ్చు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధనా రచనలు, తెలంగాణ ప్రాంత రచనలు, సేకరణలు అనేకం ఉన్నాయి.

డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న సామాజికవేత్త బినామెహతా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని లేబుల్స్ పాప్–అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త బినామెహతా మంగళవారం ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్‌లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, డిజైనర్‌వేర్ వస్త్ర ఉత్పత్తులను ఒక వేదికపై ప్రదర్శించడం అభినందనీయమని ఈ సందర్భంగా అమె అన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. డి సన్స్ పటోలా ఆర్ట్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు అండగా నిలబడడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్‌కోట, పటోలా, దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి రెండు వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సూచించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచనల మేరకు వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని ,వ్యాధులు ఉంటే సర్వే సిబ్బందికి తెలపాలని వైద్యం అందిస్తారన్నారు. ఇంటి పరిసరాల్లో, కాలనీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఆర్ఓ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రాధిక, కౌశిక్, 23వ వార్డు కౌన్సిలర్ జహంగీర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ముఖ్యం



సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణ సమయాల్లో చిన్నచిన్న తప్పులకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సేఫ్టీపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు సేఫ్టీపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడంతో పాటు ఇతరులకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. టీటీఐ ప్రతినిధి హరీశ్, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమన్నారు. డ్రంకన్ డ్రైవ్ వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత వీటి బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నవనీత, ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు అరవింద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోండి

హైడ్రాకు బీజేపీ నేత ఫిర్యాదు

గచ్చిబౌలి: మాదాపూర్‌లో ఎన్ కన్వెన్షన్ పేరిట తమ్మిడి చెరువును కబ్జా చేశారని బీజేపీ రాష్ట్ర నాయకులు, జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. శిల్పారామం ఎదురుగా తమ్మిడి చెరువు 29.24 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. కన్వెన్షన్ నిర్మాణ సమయంలో 3.30 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ్మిడి చెరువు పూర్తి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాప్‌లను ఫిర్యాదుతో పాటు అందజేశారు. తమ్మిడి చెరువును పునరుద్ధరించాలని కసిరెడ్డి కోరారు.

న్యాయవాదుల నిరసన

కూకట్‌పల్లి: అడ్వొకేట్ జేఏసీ పిలుపు మేరకు కూకట్‌పల్లి న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. న్యాయవాది సంతోష్‌ను అక్రమంగా బోరబండ పోలీస్‌స్టేషన్‌కు తరలించినందుకు ఎస్ఐ జమీల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల న్యాయవాదులపై పోలీసుల వేధింపులు పెరిగిపోయాయన్నారు. వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సామాజిక సేవలో పాలు పంచుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని మంజీర విజ్ఞాన కేంద్రం (ఎంవీకే) ప్రతినిధి డాక్టర్ పెంటయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో చైతన్య స్కూల్‌లో జరిగిన మంజీర విజ్ఞాన కేంద్రం (ఎంవికే) సమావేశంలో డా. పెంటయ్య, ఎంవీకే ఫౌండర్ సభ్యులు రాజయ్య మాట్లాడుతూ... అందరూ సామాజిక సేవలో పాలు పంచుకోవాలన్నారు, పేదలకు విద్య, వైద్యం ఇతర సహాయ, సహకారాలు అందించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింలు ,అర్జున్, శ్రీనివాస్, అడ్వొకేట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



మాతృశ్రీనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జీఎం బ్రిజేష్, జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: మియాపూర్ మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ కాయిదమ్మకుంట చెరువు పరిసర ప్రాంతాలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జీఎం బ్రిజేష్, మేనేజర్ పూర్ణేశ్వరిలతో కలిసి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా మాతృశ్రీనగర్ అపర్ణ ఆర్చిడ్స్, కాయిదమ్మకుంట వద్ద మురుగు సమస్యను స్థానికులతో కలిసి పరిశీలించారు. త్వరలోనే పైప్‌లైన్ పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు. అపర్ణ ఆర్చిడ్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ క్లోరిన్ మాత్రల పంపిణీ



వెంకటేశ్వరకాలనీ: వర్షాకాలం కుళాయి ద్వారా వచ్చే నీటిలో క్లోరిన్ మాత్రలు వేసుకొని వాడుకోవాలని జలమండలి తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు సూచించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో, బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో నీటి సరఫరా వేళల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేశారు. రంగు మారిన నీళ్ళు వస్తే కంగారు పడవద్దని వర్షాకాలంలో రంగుమారిన నీళ్లు రావడం సహజమేనని ప్రజలకు అవగాహన కల్పించారు. 20 లీటర్ల నీళ్ళలో ఒక మాత్రను పొడి చేసి వేయాలని ఎటువంటి ప్రమాదం ఉండదని తెలిపారు. క్లోరిన్‌మాత్రలు వేసిన నీటిని తాగడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని ఇది ఎంతో మంచిందని తెలిపారు. మూడుసార్లు ఫిల్టర్ చేసిన తర్వాతనే నీటి సరఫరా చేస్తామని క్లోరిన్ మాత్రల వల్ల నీరు మరింత శుద్ధి అవుతుందని తెలిపారు.

వర్షం.. జలమయం

జాతీయ రహదారిపైన నిలుస్తున్న నీరు ● నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు



పటాన్‌చెరు రింగ్‌రోడ్డు చౌరస్తాలో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు



అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని భ్రమరాంబ కాలనీలో..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలనీలు జలమయమవుతున్నాయి. ఆ సమయంలో మాత్రమే అధికారులు నామమాత్రపు చర్యలు తీసు కుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈ సమస్య తీవ్ర రూపందాల్చింది. వర్షపు నీటి కాలువలు కబ్జాలకు గురికావడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, కొన్నిచోట్ల కాలువల్లో చెత్త రాళ్ళు నిండి పోవడంతో సమస్య నెలకొంటోంది. ఒకప్పుడు భారీ వర్షం కురిసినా రోడ్లపై చుక్క నీరు కనిపించేది కాదు. వరద నీటి కాలువలు ఉండటం. కాని ప్రస్తుతం వాటిపై నిర్మాణాలు చేపట్టడంతో పరిస్థితి దారుణంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు.



భారతీనగర్ డివిజన్ మ్యాక్ సొసైటీ కాలనీలో..

వరదనీటి కాలువలు మాయం

పలుచోట్ల వరదనీటి కాలువలు మాయమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వరద కాలువలు కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానికులు జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాలలో వరదకాలువలు రాళ్లు మట్టితో నిండిపోయాయి, వీటిని శుభ్రం చేయాలని స్థానికులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇస్నాపూర్ జాతీయ రహదారిపై ..

సమస్యలమయం..

పటాన్‌చెరు, రామచంద్రాపురం,భారతీనగర్ డివిజన్, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వర్షంపడితే చాలు కాలనీలు, రోడ్లు జలమయం అవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

జాతీయ రహదారిపై సైతం..

రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి, ఇస్నాపూర్ ప్రాంతంలో వర్షంపడితే జాతీయరహదారిపై భారీగా నీరు నిలుస్తోంది. దీంతో గంటల కొద్ది ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సాయికాలనీ, సాయి భగవాన్, భ్రమరాంబ కాలనీలో బీరంగూడ కొండపై నుంచి వరద నీరు వస్తుంది. ఈ నీరు కాలనీలలో ఇళ్లలోకి చేరుతుంది. ఈ సమస్య చాలాకాలంగా ఉంది. ఇప్పటికే ఆ కాలనీలలో డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది.సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. – తుమ్మల పాండురంగారెడ్డి, చైర్మన్, అమీన్‌పూర్

ఇంట్లోనుంచి బయటకు రాలేని పరిస్థితి




సంవత్సరాల తరబడి వరద నీటి సమస్య ఉంది. ఆ సమయంలో అధికారులు, పాలకులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కురిస్తే ఇంట్లోనుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. – రాజయ్య, భ్రమరాంబకాలనీ, అమీన్‌పూర్

అడుగు పెట్టలేం..



చిన్నపాటి వర్షం పడితే మాక్స్ సొసైటీ కాలనీల నుంచి ఈఎస్ఐ రోడ్డుకు వెళ్లలేని పరిస్థితి. ఈ మార్గంలో పెద్ద ఎత్తున వర్షంనీరు చేరుతుంది. నిత్యం ఈ మార్గంలో ఇబ్బందులు తప్పడం లేదు. – రజనీష్‌గౌడ్, భారతీనగర్ డివిజన్

పాపిరెడ్డి కాలనీలో కార్డన్ సెర్చ్



పాపిరెడ్డి కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చందానగర్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో మంగళవారం రాత్రి మియాపూర్ ఏసీపీ నర్సింహారావు నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ, మాదాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు పాపిరెడ్డి కాలనీ, వాంబే గృహాలు పరిసర ప్రాంతాలలో తనిఖీలు చేశామన్నారు. సుమారు 120 ఇళ్లను తనిఖీ చేయగా 16 బైకులు, ఒక ఆటోకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. ఈ సెర్చ్‌లో చందానగర్ సీఐ పాలవెల్లి, ఆర్సీపురం, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్లు, మియాపూర్ డీఐ, ఎస్ఐలు 6 మంది, 46 మంది సిబ్బంది పాల్గొన్నారు.